31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

ఆదివారం,అక్టోబర్ 25 , 2026 పేజీలు : 8

# పోలీసులకు వ్యాసరచన పోటీలు



చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 24 : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ పోటీల్లో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడం, సామాజిక బాధ్యతను గుర్తుచేయడం,ప్రజాసేవ పట్ల నిబద్ధతను బలోపేతం చేయడం, ప్రజానుకూల పోలీసింగ్ పై అవగాహన కల్పించడమే పోటీల ఉద్దేశమని అధికారులు తెలిపారు.మొదటి విభాగంలో కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు సివిల్,ఏఆర్ సిబ్బందికి 2లో

## గడువులోగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ

# నిర్మాణ పనులు పూర్తి చేయాలి



చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 24: గడువులోగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ లు అధికారులను ఆదేశించారు. శనివారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జగిత్యాలలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా పూర్తి చేయాల్సిన పనుల వివరాలను సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే వైద్య కళాశాల భవనంతో పాటు హాస్టల్ బ్లాక్, కిచెన్, తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి, వాటి పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేలా నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. హాస్టల్ బ్లాక్, కిచెన్, తరగతి గదులతో పాటు కళాశాలకు సంబంధించిన అన్ని నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్య కళాశాల అందుబాటులోకి రావడం ద్వారా జిల్లాలో వైద్య విద్య అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులను వేగవంతం చేసి, అవసరమైన అన్ని వసతులతో కళాశాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు-మిగతా 2లో

## డ్రోన్ సాంకేతికతను

# రైతులు సద్వినియోగం చేసుకోవాలి



- జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 24 : వ్యవసాయంలో నూతన సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జగిత్యాల ఆధ్వర్యంలో రూ.9 లక్షలతో కొనుగోలు చేసిన డ్రోన్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని,సహకార సంఘం ఆధ్వర్యంలో డ్రోన్ ను రైతులకు అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం వల్ల శారీరక శ్రమ తగ్గడంతో పాటు ఆరోగ్యపరంగా మేలు జరుగుతుందన్నారు.తక్కువ ఖర్చుతో ఆధునిక సాంకేతికతను వినియోగించుకునేలా పీఏసీఎస్ సేవలు అందించడం ఆనందదాయకమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ సబ్సిడీ ఇస్తోందని, రైతులు,సహకార సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జగిత్యాల వ్యవసాయ రంగానికి చారిత్రక ప్రాధాన్యత ఉందని గుర్తుచేశారు. 1980క 2లో

# విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది

- జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భూమిపూజకు ఏర్పాట్లు పూర్తి



చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 24 : తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మంజూరు చేసిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులకు నేడు మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు భూమిపూజ నిర్వహించనున్న నేపథ్యంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ శనివారం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి భూమిపూజ, సభ స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలోని తాటిపల్లి, మొరపల్లి శివారులో 25 ఎకరాల్లో ఈ స్కూల్ ఏర్పాటు కానుందని,పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు వసతి,భోజనం,క్రీడలు, నైపుణ్యాభివృద్ధి సౌకర్యాలను ఒకే ప్రాంగణంలో అందించడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. 2500 మంది విద్యార్థులు, 500 మంది స్టాఫ్ కు అనుగుణంగా ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్య, హాస్టల్, భోజన వసతి, క్రీడా ప్రాంగణం, మీటింగ్ హాల్ తో ఆధునిక సదుపాయాలు కల్పించను న్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చల్గల్ లో సహజ వ్యవసాయానికి స్థలం కేటాయించడంతో తాటిపల్లి, మొరపల్లి లో ఈ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.గత 2లో

## పీఎం రాహత్ పథకంతో

# రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- పీఎం రాహత్ పథకంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




చురకలు ప్రతినిధి,రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 24 : పీఎం రాహత్ పథకం(ప్రైమ్ మినిస్టర్ రోడ్ ఆక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలైజేషన్ అండ్ అస్యూర్డ్ ట్రీట్మెంట్)తో రోడ్డు ప్రమాద బాధితుల కు మెరుగైన వైద్యం అందుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు.పీఎం రాహత్ పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో అత్యవసర వైద్యం అందించడం, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల అనుసంధానం, నిధుల విడుదల ప్రక్రియపై చర్చించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ..రోడ్డు 2లో

## గోదూర్ గ్రామ పంచాయతీకి బాడీ ఫ్రీజర్ అందజేత

- తండ్రి,తాత జ్ఞాపకార్థం బాడీ ఫ్రీజర్ విరాళం



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (24) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్ గ్రామ పంచాయతీకి చెందిన ఒల్లాడపు భూమేష్ తన తండ్రి గంగాధర్, తాత సుందరయ్య జ్ఞాపకార్థం రూపాయలు 57 వేల విలువైన బాడీ ఫ్రీజర్‌ను శనివారం గ్రామ పంచాయతీకి విరాళంగా అందజేశారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఆయన ఈ విరాళాన్ని అందించడం గ్రామంలో పలువురి దృష్టిని ఆకర్షించింది.గ్రామంలో ఎవరైనా మృతి చెందిన సందర్భంలో మృతదేహాన్ని భద్రపరచాల్సిన అవసరం ఏర్పడితే బాడీ ఫ్రీజర్ ఉపయోగపడుతుంది. గ్రామ పంచాయతీకి ఈ సదుపాయం అందుబాటులోకి రావడం వల్ల అవసరమైన సమయంలో గ్రామ ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. తన కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం ప్రజలకు ఉపయోగపడే వస్తువును అందించడం ద్వారా భూమేష్ తన సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బండి రాజేష్ ఒల్లాడపు భూమేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. గ్రామానికి ఉపయోగపడే విధంగా బాడీ ఫ్రీజర్‌ను విరాళంగా అందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి హర్షద్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ కుటుంబాన్ని పరామర్శించిన సత్య న్యూస్ ప్రతినిధి



**చురకలు ప్రతినిధి మంథని,అక్టోబర్ 24 :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణం లోని దొంతుల వాడ ప్రాంతానికి చెందిన స్థానిక సీనియర్ జర్నలిస్ట్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య మాతృమూర్తి పోతరాజు వెంకటమ్మ ఈనెల 20 తారీకు మరణించగా శనివారం సత్య న్యూస్ తెలుగు ప్రతినిధి తాటి సత్యనారాయణ గౌడ్ పోతరాజు వెంకటమ్మ చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనంలో వారితో ఉన్న సన్నితం బంధుత్వాన్ని పాత జ్ఞాపకాలను వారి నాన్నగారు రామన్నతో కుటుంబ సభ్యులతో గుర్తు చేశారు.అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సంతాపం సానుభూతి వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు స్థానిక కేడీసీసీ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ పోతరాజు సతీష్ పాల్గొన్నారు.

## డ్రోన్ సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**మొదటి పేజీ తరువాయి...** ముందే చల్గల్, పొలాస వ్యవసాయ క్షేత్రాలు, అగ్రోస్ ఇండస్ట్రీస్ వంటి సంస్థలు ఇక్కడ ఉన్నాయని, నాలుగు ఉమ్మడి జిల్లాల నీటిపారుదల శాఖ అధికారులు ఇక్కడ చర్చించేవారని, లస్కర్ నుంచి చీఫ్ ఇంజనీర్ వరకు క్వార్టర్స్ ఉండేవని తెలిపారు.గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కీలక కార్యాలయాలు తరలిపోయా యన్నారు. కేంద్రం సహకార సంఘాలకు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించినా ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. దేశంలో కంప్యూటరీకరణ జరిగిన సహకార సంఘాలు తెలంగాణలోనే ఉన్నాయని, దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, నాయకులు బండ శంకర్, సమిండ్ల శ్రీనివాస్, అడువల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# పీఎం రాహత్ పథకంతో రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం

**మొదటి పేజీ తరువాయి...** ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడిని ఆసుపత్రిలో చేర్పించడానికి పోలీస్ ఆమోదిత కేసులకు గరిష్టంగా 1 లక్షా 50 వేల రూపాయల వరకు పూర్తి చికిత్స అందించే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రమాదం తర్వాత బాదితుల ప్రాణాలు కాపాడేందుకు గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని, ఈ సమయంలో వేగంగా స్పందించాలని సూచించారు.ఈ పథకం సమర్థవంతమైన అమలు కోసం జిల్లా కలెక్టర్లు రహదారి భద్రత కమిటీలతో సమన్వయం చేసుకొని, జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారులను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని సూచించారు.ప్రమాదాల నివారణకు, బాధితుల వివరాలను పారదర్శకంగా నమోదు చేయడానికి టీఎంఎస్ 2.0 పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా బాధితుల చికిత్స ఖర్చులను నేరుగా ఆసుపత్రులకు చెల్లించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలలో ఈ పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు.అత్యవసర సేవల కోసం 112, సీసీటీఎన్ఎస్ వ్యవస్థలతో అనుసంధానం చేయడం ద్వారా బాధితులకు వేగవంతమైన సేవలు అందుతాయని వివరించారు. ప్రతి జిల్లాలోనూ ఈ పథకం అమలును కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎస్ స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. పీఎం రాహత్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు.రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించి,వారి ప్రాణాలు కాపాడాలన్నారు.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత శాఖలు వెంటనే అప్రమత్తమవ్వాలని ఆదేశించారు.సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఉండి ప్రమాదాల వల్ల కలిగే ప్రాణ నష్టాలను తగ్గించాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, డాక్టర్ సంతోష్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గడువులోగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**మొదటి పేజీ తరువాయి...** అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమా ర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కావడం ప్రజలకు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. వైద్య కళాశాల అందుబాటులోకి వస్తే జిల్లాలోని విద్యార్థులకు వైద్య విద్యను అభ్యసించేందుకు మెరుగైన అవకాశాలు లభించడంతో పాటు, ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు. వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. భవన నిర్మాణ పనులతో పాటు విద్యార్థులకు అవసరమైన హాస్టల్, కిచెన్, తరగతి గదులు తదితర మౌలిక వసతులను నాణ్యతతో ఏర్పాటు చేయాలని తెలిపారు. నిర్మాణ పనుల విషయంలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కరించుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ వైద్య కళాశాల త్వరితగతిన అందుబాటులోకి వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సంబంధిత శాఖల అధికారులు, వైద్య కళాశాల నిర్మాణ పనులకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల టాస్క్‌లో ఉచిత శిక్షణ



**చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 24:** సిరిసిల్ల టాస్క్ (తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్) రీజనల్ సెంటర్లో టెక్నీకల్ కోర్సులు, బ్యాంకింగ్ బీ ఎస్ ఎఫ్ ఐలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి అయిన అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రం లోని జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో ఉన్న టాస్క్ రీజనల్ సెంటర్ లో ఈ నెల 27వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని, అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. టాస్క్ లో శిక్షణ పొందిన అభ్యర్థులకు మంచి ప్యాకేజీలతో ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగతా వివరాలకు 95734 20718, 70755 22671లో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

## ఐపీ చానళ్ళకు అక్రిడిటేషన్లు లేవు

**చురకలు, హైదరాబాద్, అక్టోబర్ 24 :** రాష్ట్రం కేబుల్ టీవీల స్థానంలో నడుస్తున్న ఇంటర్నెట్ ప్రోటోకాల్ టెలివిజన్(ఐపీ) ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వడం కుదరదని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తేల్చిచెప్పారు. ఇప్పటికే 26 వేల అక్రెడిటేషన్ కార్డులిచ్చామని,గతంలో కంటే నాలుగు వేల కార్డులు ఎక్కువే ఇచ్చామని, గతంలో లేని ఐపీ చానళ్ళకు కొత్తగా అక్రెడిటేషన్ కార్డులివ్వలేమని ఆయన స్పష్టం చేశారు. శనివారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలో కేబుల్ చానల్స్ ప్రతినిధులు, పలువురు ఫెడరేషన్ నాయకులు సచివాలయంలో మంత్రి పొంగులేటిని కలిసి కేబుల్ ఐపీ చానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు, జర్నలి స్టులకు ఇళ్ళస్థలాలు, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు.

## విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది

**మొదటి పేజీ తరువాయి...** ప్రభుత్వంలో వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్మెంట్ కేంద్రం నిర్వీర్యమైందని, అక్కడ ఉన్నతాధికారులకు శిక్షణ ఇచ్చేవారని గుర్తుచేశారు. కేంద్రీయ విద్యాలయానికి 5 ఎకరాలు కేటాయించామన్నారు. జగిత్యాలకు ఈ స్కూల్ మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. నేటి భూమిపూజ కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులు,తల్లిదండ్రులు, ప్రజాప్రతి నిధులు హాజరు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, మాజీ జడ్పీటీసీ పెండెం రాములు, సర్పంచులు కట్ట రాజేందర్, బొలిశెట్టి గంగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ అబ్బూరి మల్లేశం గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ నక్కల రవీందర్ రెడ్డి, నాయకులు సమీండ్ల శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు వ్యాసరచన పోటీలు

**మొదటి పేజీ తరువాయి...** ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుంచి ఎలాంటి సేవలను ఆశిస్తారు?పోలీసు అధికారుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర ఏమిటి? సోషల్ మీడియాకు బానిస కాకుండా దానిని సద్వినియోగం చేసుకోవడం ఎలా అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రెండో విభాగంలో ఎస్ఐ, ఆర్ఎస్ఐ ఆపై హోదా అధికారులకు పౌరుల నుంచి గౌరవం, ఆదరణ, సద్భావన పొందేందుకు పోలీసులు ఎలాంటి కృషి చేయాలి?, క్షేత్రస్థాయిలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ఎలా అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా, తమ ఆలోచనలు, అనుభవాలు, విధి నిర్వహణలో సవాళ్లు, ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధానాలను వ్యాసాల రూపంలో వ్యక్తపరిచే అవకాశం కల్పించారు.

## ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడి కుటుంబానికి ఎమ్మెల్యే సంజయ్ పరామర్శ



**చురకలు ప్రతినిధి కోరుట్ల అక్టోబర్ 24 :** కోరుట్ల నియోజకవర్గం మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఏఐటీయూసీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎశమేని గణేష్ నానమ్మ రాజవ్వ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శనివారం వారి నివాసానికి వెళ్లి రాజవ్వ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఎశమేని గణేష్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, రాజవ్వ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి కలిగిన తీరని లోటు పట్ల విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అంగడి పురుషోత్తం, మాజీ కౌన్సిలర్ బంగారుకాళ్ల కిషోర్, జక్కం బాబు, 19వ వార్డు ఇన్‌చార్జి ఆకుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## సెలవుల్లో విద్యార్థులకు ఉపాధి కొలువుల శిక్షణ



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, అక్టోబర్ 24 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లె టి జి ఆదర్శ పాఠశాల ఇంటర్మీడియట్ విద్యార్థులకు దసరా పండుగ సెలవుల్లో స్వయం ఉపాధి కల్పనలోభాగంగా వృత్తివిద్యా రిటైల్ మార్కెటింగ్‌తోపాటు,ఇతర కోర్సుల్లో శిక్షణ నిస్తున్నట్లు ప్రిన్సిపల్ సందీప్ రాజు తెలిపారు.విద్యార్థులకు పుస్తక జ్ఞానంతోపాటు పనిఅనుభవం కల్పించాలనే లక్ష్యంతో ఇంటర్న్ షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రిటైల్ మార్కెటింగ్ మేనేజ్మెంట్ వివిధ భాగాల్లో పలు స్టోర్లలో శిక్షణ పొందుతున్నట్లు,కస్టమర్లతో వ్యవహరించే విధానం, విక్రయ నైపుణ్యాలు, స్టాక్ నిర్వహణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు వంటి అంశాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్నట్లు,ఈ శిక్షణతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమయపాలన, బృంద స్ఫూర్తి పెంపొందడంతో పాటు భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉందని,రిటైల్ మార్కెటింగ్‌లో శిక్షణ పొందు తున్న విద్యార్థులకు ఉద్యోగ ఉపాదే ప్రధాన లక్ష్యంగా శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. వృత్తి విద్యా కోర్సు శిక్షకులు నూతి రవీందర్ ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తు ఉపాధికి బాటలు వేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.

## మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు సత్కారం



**చురకలు, విలేఖరి, వెల్గటూర్,అక్టోబర్ 24 :** రాష్ట్ర మాజీ సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అబుదాబి లోని హుదైరియత్ డోమ్‌లో అత్యంత వైభవంగా నిర్వహించిన తెలుగు దసరా సంబరాలు, డాక్టర్స్అవార్డులు 2026 వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సందర్భంగా దుబాయ్‌లో ఉపాధి నిమిత్తం స్థిరపడినజగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం శ్రీ రాముల పల్లె గ్రామస్థులు, ధర్మపురి నియోజక వర్గ కొప్పుల అభిమానులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభిమానం చాటుకున్నారు. విదేశాల్లో ఉన్నప్పటికీ మాతృభూమిని, తమ నాయకుడిని గుర్తుంచు కొని ఈ వేడుకల్లో పాల్గొని ఆదరించడం పట్ల కొప్పుల ఈశ్వర్ తన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేకోరుకంటిచందర్, పలువురు ప్రవాస తెలంగాణ వాసులు, అభిమానులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

**-వెంకటాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద కారు ఢీకొని వ్యక్తి మృతి**

**చురకలు ప్రతినిధి కోరుట్ల,అక్టోబర్ 24 :** కోరుట్ల మండలంలోని వెంకటాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద జాతీయ రహదారి NH-63పై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజాంపురకు చెందిన షేక్ షౌకత్ అలీ (62) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. కోరుట్ల పట్టణంలోని నిజాంపురకు చెందిన షేక్ షౌకత్ అలీ గోనె కోసం వెంకటాపూర్ గ్రామానికి వెళ్లి, తన టీవీఎస్ ఎక్స్ఎల్ వాహనంపై తిరిగి వస్తుండగా వెంకటాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ప్రమాదం జరిగింది. అదే సమయంలో కోరుట్ల నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న కారు (TS-02-EZ-5410) షౌకత్ అలీ ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది.కారు డ్రైవర్ లింగ సాయి శరత్ అతివేగంగా,నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ప్రమాదంలో షౌకత్ అలీ తలకు, కుడి కాలికి, వీపుకు తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే అతడిని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి,మెరుగైన చికిత్స కోసం జగిత్యాలలోని ఆరోగ్య ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు శనివారం మధ్యాహ్నం సుమారు 12:10గంటలకు మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఎం.డి. సుజాహిద్ అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీసులు కేసు నమోదు చేశారు.ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టి,కారు డ్రైవర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు విచారణ కొనసాగిస్తున్నారు.

# పండుగల వేళ ఉద్యోగులు సమ్మె చేయడం బాధాకరం

**-ఎన్ హెచ్ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలి**

**-మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 24 :** పండుగల వేళ ఉద్యోగులు సమ్మె చేయడం బాధాకరమని, ఎన్ హెచ్ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలని మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎన్ హెచ్ఎం జేఏసీ ఉద్యోగులు న్యాయమైన హక్కుల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మెకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ పండుగల వేళ బతుకమ్మ, దసరా, దీపావళి సమయంలో ఉద్యోగులు సమ్మె చేయడం బాధాకరమన్నారు. సమ్మె ముగుస్తుందని అనుకున్నా కొనసాగడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. వైద్య సేవలు రాజ్యాంగబద్ధమైన హక్కు అని, పేదలకు ఉచిత వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆరోగ్యశ్రీ అమలు తీరుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నేషనల్ హెల్త్ మిషన్ లో జననీ శిశు సంరక్షణ కోసం గతంలో కేసీఆర్ ప్రభుత్వం కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ ఇచ్చేదని, ఇప్పుడు అవి మాయమయ్యాయని విమర్శించారు. కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం భరించాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించలేక కేంద్ర నిధులకు ఆటంకం కలిగిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల, పల్లె దవాఖానలు, బస్తీ దవాఖానలు తెచ్చామని గుర్తుచేశారు. ఎన్ హెచ్ఎం లో పనిచేసే ఆడబిడ్డలకు కనీసం ప్రసూతి సెలవులు, మెడికల్ ఫెసిలిటీస్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. 12 రోజులుగా సమ్మె చేస్తుంటే మంత్రి, కలెక్టర్ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం చెప్పినా రూ.8 వేలకు పనిచేయించడం దారుణమన్నారు. ఫస్ట్ ఏఎన్ఎం, సెకండ్ ఏఎన్ఎం ఇద్దరూ ఒకే బాధ్యత చేసినా వేతనంలో ఆకాశ నేల తేడా ఉందన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన వారిని పండుగ పూట రోడ్డున పడేయడం సరికాదన్నారు. ఎల్ నినో తో ధరలు పెరిగాయని ముఖ్యమంత్రే చెబుతున్నా స్పెషల్ ఇన్సెంటివ్ ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం బెల్ట్ షాపుల ద్వారా ఆదాయం చూస్తోందే తప్ప ఉద్యోగుల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్ హెచ్ఎం ఉద్యోగుల సమస్యను బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, స్థానికంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ఎం ఉద్యోగులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బండలింగాపూర్‌లో ఆర్మీ సైనికుడిపై దాడి

**-14 మంది అరెస్టు పరారీలో మరికొందరు**

**-14 సెల్‌ఫోన్లు, 7 ద్విచక్ర వాహనాలు, చేతి కడియం స్వాధీనం**



**చురకలు విలేకరి,మెట్‌పల్లి,అక్టోబర్ 24 :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం బండలింగాపూర్ గ్రామంలో ఆర్మీ సైనికుడిపై దాడి ఘటనకు సంబంధించి పోలీసులు 14 మంది నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 14 సెల్‌ఫోన్లు, 7 ద్విచక్ర వాహనాలు, దాడికి ఉపయోగించినట్లు పేర్కొన్న స్టీల్ చేతి కడియాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరికొందరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మెట్ పల్లి సీఐ బి.సురేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 22 రాత్రి వెల్లుల్ల గ్రామానికి చెందిన వన్నెల వికాస్‌పై బండలింగాపూర్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దాడి చేసినట్లు పేర్కొన్నారు.ఈ ఘటనకు ప్రతిస్పందనగా వికాస్ తన స్నేహితులు సుమారు 30 మంది గుంపుగా ఏర్పడి, ద్విచక్ర వాహనాలపై అర్ధరాత్రి దాటిన తర్వాత మెట్ పల్లి మండలం వెల్లుల్ల గ్రామం నుండి బండలింగాపూర్‌కు వెళ్లారు. అక్టోబర్ 23 తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో గ్రామంలోని హనుమాన్ ఆలయం సమీపంలో బతుకమ్మ ఆడుతున్న వారి పక్క నుంచి యువకులు వేగంగా, నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాలపై వెళ్లడంతో అక్కడే ఉన్న ఆర్మీ సైనికుడు తిగుర్ల స్వామి వారిని ప్రశ్నించారు.ఈ క్రమంలో వాగ్వాదం చోటుచేసుకోగా,కొందరు యువకులు ఆయనపై దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.స్టీల్ చేతి కడియం తో ముఖంపై కొట్టడంతో స్వామికి తీవ్ర రక్తగాయమైంది. బాధితుడు తిగుర్ల స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా అక్టోబర్ 24 ఉదయం మేడిపల్లి గ్రామ శివారులోని ఇబ్రహీంపట్నం ఎక్స్‌రోడ్డు వద్ద వెల్లుల్ల గ్రామానికి చెందిన 14 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 14 సెల్‌ఫోన్లు, 7 ద్విచక్ర వాహనాలు,ఒక స్టీల్ చేతి కడియాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.ఈ ఘటనతో సంబంధం ఉన్న మరికొందరునిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

**యువత ప్రవర్తనపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి.**

యువకులు గుంపులుగా ఏర్పడి అర్ధరాత్రి వేళల్లో గొడవలు, దాడులకు పాల్పడితే వారి భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని మెట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సురేష్ బాబు, ఇబ్రహీంపట్నం ఎస్ఐ జి. నవీన్ కుమార్ హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో తిరుగుతున్నారు అనే విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. యువత చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నేరాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలతోపాటు భవిష్యత్తులో ఉద్యోగాలు, పాస్‌పోర్టు వెరిఫికేషన్ వంటి ప్రక్రియలపైనా ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# ముగిసిన బీర్‌పూర్ ప్రీమియర్ లీగ్



**చురకలు విలేకరి, బీర్ పూర్, అక్టోబర్ 24 :** బీర్ పూర్ మండలం మంగేళ గ్రామానికి చెందిన యువ క్రీడాకారులకు నిర్వహించిన బీర్ పూర్ ప్రీమియర్ లీగ్ -11 టోర్నమెంట్ లో విజయం సాధించి తెచ్చిన కప్ ను గ్రామ ఉప సర్పంచ్ దగ్గుల వీరేశం కు అంకితం చేశారు. గ్రామ సర్పంచ్ బనక సతీష్ చేతుల మీదుగా ఈ కప్ ను ఉప సర్పంచ్ కు అందజేశారు. యువత చూపిన అభిమానం, గౌరవానికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ యువత మత్తు పానీయాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. క్రీడలు శరీర ధృఢత్వం, మనోల్లాసంతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. గ్రామ యువత సాధించిన విజయాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని, భవిష్యత్తులో మరిన్ని టోర్నీల్లో పాల్గొని గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.కప్ ను తనకు అంకితం చేయడం ఆనందంగా, గర్వంగా ఉందని ఉప సర్పంచ్ వీరేశం తెలిపి యువకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అజ్మీరా వినోద్, వార్డు సభ్యుడు గురునాథం మల్లారెడ్డి, లగన్స్ టీం సారథి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకల్లో మహిళలకు ప్రోత్సాహక బహుమతులు



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (24) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మకపేట్, తిమ్మాపూర్,యామాపూర్ గ్రామాల్లో బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందించారు. బతుకమ్మ వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొనగా,పండుగ ముగింపు సందర్భంగా సర్పంచ్‌లు కాశీరెడ్డి భాస్కర్ రెడ్డి, బస శ్రావణ్,సర్పంచ్ కనుక నాగేశ్ లు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామాల్లో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మలను పేర్చి,పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొని అనంతరం నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్ వాడీ ఆయాలకు విధులపై అవగాహన



**చురకలు విలేకరి,జగిత్యాల,అక్టోబర్ 24 :** ఐసీడీఎస్ ప్రాజెక్టు జగిత్యాల కార్యాలయంలో శనివారం ఐదు సెక్టార్ల ఆయాల ప్రాజెక్టు సమావేశాన్ని నిర్వహించారు. సీడీపీఓ జయప్రద, ఏసీడీపీఓ రాజశ్రీ సమక్షంలో జరిగిన సమావేశానికి జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ భాస్కర్ హాజరై ఆయాల విధులు, బాధ్యతలపై వివరించారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రంలో ఉండాలని,యూనిఫామ్ ధరించాలని సూచించారు. పిల్లలను ఎక్కువ సంఖ్యలో హాజరు పరిచేలా చూడాలని, ఉదయం 10 గంటల వరకు ఉడికించిన గుడ్డు తినిపించి, ఒంటిగంటకు రుచికరమైన వేడి భోజనం, మూడు గంటలకు స్నాక్స్ పెట్టాలన్నారు. టీచర్ తో పాటు ఉదయం 9 గంటలకు ప్రార్థన చేపించి ఆట, పాట, కథల్లో పాల్గొనాలని, పోషకాహార పదార్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, ముందు వచ్చిన ఆహార పదార్థాలను ముందుగా వినియోగించాలని, గుడ్లు పాడవకుండా చూసుకోవాలని సూచించారు. లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా, ప్రేమగా మాట్లాడాలని తెలిపారు. ఈ సమావేశంలో సూపర్ వైజర్లు మమత, కవిత, స్వరూప, లావణ్య, నిర్మల, యూడీసీ సరోజ, బ్లాక్ కోఆర్డినేటర్ లక్ష్మణ్, కంప్యూటర్ ఆపరేటర్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపూర్‌లో ఎయిర్ టెల్ సేవలు

**-స్థంభన అధికారుల తీరుపై సర్పంచ్ ఆగ్రహం**



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట అక్టోబర్ 24 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో గతవారం రోజులుగా ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ సమస్యలతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాల్స్, ఇంటర్నెట్ సేవలు సక్రమంగా అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ ఎయిర్‌టెల్ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అగ్రహారం సర్పంచ్ మామిండ్ల కిషన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించి, గ్రామంలో ఎయిర్‌టెల్ సేవలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

# ఆరుతడి పంటలు సాగు చేయాలి

**-ఖరీఫ్‌లో తక్కువ వర్షపాతం నమోదు**
**-ఖేతీ బచావో అభియాన్‌లో రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల సూచన**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం, అక్టోబర్ (24) :** ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు,ఖరీఫ్ సీజన్‌లో తక్కువ వర్షపాతం,భూగర్భ జలాల లభ్యత తగ్గడం,అక్టోబర్‌లోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్ గ్రామంలోని రైతు వేదికలో శనివారం నిర్వహించిన ఖేతీ బచావో అభియాన్ కార్యక్రమంలో కోరుట్ల ఏడీఏ డి. రమేష్, మండల వ్యవసాయ అధికారి అకు రాజ్‌కుమార్ రైతులకు పంటల మార్పిడి,నీటి పొదుపు పద్ధతులు,ఆరుతడి పంటల సాగు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వరి సాగుకు అధిక మొత్తంలో నీరు అవసరమవుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో సాగునీటి లభ్యత రైతులకు సవాలుగా మారే అవకాశం ఉందని తెలిపారు. రైతులు తమ భూముల స్వభావం, అందుబాటులో ఉన్న నీటి వనరులను బట్టి కంది, పెసర, మినుము, శనగ, జొన్న, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలన్నారు. ఆరుతడి పంటల సాగుతో నీటి వినియోగాన్ని తగ్గించుకోవడంతో పాటు సాగు ఖర్చులను నియంత్రించుకోవచ్చని, పంటల మార్పిడి ద్వారా భూసారాన్ని పరిరక్షించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకొని, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ రైతులు వ్యవసాయం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి రాజేష్, వ్యవసాయ విస్తరణ అధికారి సాగర్, ఉద్యానవన విస్తరణ అధికారి శ్రీలత రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా చైతన్య ప్రస్థానాన్ని జయప్రదం చేయాలి

**-ప్రజా చైతన్య ప్రస్థానాన్ని జయప్రదం చేయాలి**

**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 24 :** ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజా హక్కుల సాధనే లక్ష్యంగా సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రజా చైతన్య ప్రస్థానాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల బాలకృష్ణ పిలుపునిచ్చారు. జగిత్యాల ప్రెస్ క్లబ్ లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో ధర్మపురిలో ప్రజా చైతన్య సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కూలీలు, నిరుద్యోగులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన, రైతుల సమస్యల పరిష్కారం, గ్రామీణ అభివృద్ధి తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం తేవడమే ప్రస్థానం ఉద్దేశమని తెలిపారు. జిల్లాలో సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సంక్షేమ పోరాటాలకు మద్దతు




కూడగట్టేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. రైతులు, కార్మికులు, మహిళలు, యువకులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా ఇన్ చార్జి నాయిని శారద, జిల్లా కమిటీ సభ్యుడు కుంచం శంకర్, మహిళా సంఘం నాయకురాలు ఆసాది సుజాత, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బండపల్లి రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కో-కన్వీనర్ సుద్దాల అమితేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం.. ఆరుతడి పంటల వైపు రైతులు

**-రబీ సాగుపై**
**బొప్పాపూర్ లో గ్రామసభ..**
**నీటి పొదుపుపై వ్యవసాయ శాఖ అవగాహన**



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 24 :** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు, భూగర్భ జలాలు అడుగంటుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు రానున్న రబీ సీజన్‌లో అప్రమత్తంగా వ్యవసాయ ప్రణాళిక రూపొందించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డిపేట మండలంలోని అన్ని గ్రామాల్లో రబీ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం రాచర్ల బొప్పాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి-శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం, నీటి లభ్యత,రబీ సీజన్‌లో అనుకూలమైన పంటల ఎంపిక, సాగు ఖర్చులను తగ్గించుకునే మార్గాలపై రైతులకు అవగాహన కల్పించారు.

**తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యం**

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి వినియోగాన్ని తగ్గించే ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని వ్యవసాయ అధికారి రాజశేఖర్ సూచించారు. మొక్కజొన్న, పెసర, రాగులు, సజ్జలు వంటి పంటలను సాగు పరిస్థితులకు అనుగుణంగా ఎంపిక చేసుకోవాలని తెలిపారు. కంది,మినుములు వంటి పప్పుధాన్య పంటలను కూడా నేల స్వభావం,వర్షపాతం,నీటి లభ్యత ఆధారంగా పరిశీలించాలని సూచించారు. రైతులు పంటలు వేసే ముందు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని తగిన పంటలను ఎంచుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు పంట నష్టాల ముప్పును నివారించవచ్చని వివరించారు.

**అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు**

ఎల్లారెడ్డిపేట మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామాల వారీగా గ్రామసభలు నిర్వహించి రబీ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు రాజశేఖర్ తెలిపారు. రైతులు ఈ సమావేశాలకు అధిక సంఖ్యలో హాజరై వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొప్పాపూర్ ఉపసర్పంచ్ వెంకట్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు అనూష, ముకుంద్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# బూత్ కమిటీలను బలోపేతం చేయండి

## -బిజెపి పట్టణ అధ్యక్షుడు తూర్పాటిరాజు



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 24 :** హుజురాబాద్ పట్టణంలో బిజెపి బూత్ కమిటీలను బలోపేతం చేయాలని, బూత్ కమిటీలే పార్టీ విజయానికి వెన్నెముకని బిజెపి పట్టణ అధ్యక్షుడు తూర్పాటిరాజు పిలుపునిచ్చారు. బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో శనివారం శక్తి కేంద్ర ఇన్‌చార్జిల ముఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం,బూత్ కమిటీల నిర్మాణం,యువకుల సమ్మేళనం,అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న 'మన్ కీ బాత్' కార్యక్రమం నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ బూత్ కమిటీలే భారతీయ జనతా పార్టీకి వెన్నెముక అని, బూత్ స్థాయిలో పార్టీ ఎంత పటిష్టంగా ఉంటే ప్రజల్లో అంత బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రతి బూత్‌లో క్రియాశీలక కార్యకర్తలను గుర్తించి కమిటీలను పటిష్టంగా నిర్మించాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.అలాగే యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ వారిలో దేశభక్తి,సేవాభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా సమ్మేళనాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ప్రతి బూత్‌లో ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేసి, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు.జిల్లా పార్టీ సూచనల మేరకు రేపు ప్రతి శక్తి కేంద్ర పరిధిలో 'టిఫిన్ బైఠక్' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నాయకులు వెల్లడించారు.ఈ టిఫిన్ బైఠక్‌ల ద్వారా కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించడంతో పాటు బూత్ స్థాయి సమస్యలు,ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించ నున్నారు.ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో ,సమిష్టి కృషితో పనిచేస్తూ హుజురాబాద్ పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీజేపీ పట్టణాధ్యక్షులు తూర్పాటి రాజుతో పాటు జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, సెంట్రల్ ఫిల్మ్ బోర్డ్ మెంబర్ సబ్బని రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తూముల శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శులు గంట సంపత్, తిప్పబత్తిని రాజు, ఉపాధ్యక్షులు యాల్ల సంజీవరెడ్డి, వోడ్నాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ - కరీంనగర్ జాతీయ రహదారిపై

# భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సిపి గౌష్ ఆలం



**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 24 :** నూతనంగా నిర్మించిన వరంగల్ – కరీంనగర్ జాతీయ రహదారి పై ప్రయాణికుల భద్రత, ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన భద్రతా ఏర్పాట్లను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కొత్తగట్టు వద్ద ఏర్పాటు చేసిన హైవే పెట్రోలింగ్ యూనిట్, టోల్ ప్లాజా అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ అమర్చిన సీసీ కెమెరాల పనితీరు,నిఘా వ్యవస్థ, కంట్రోల్ రూమ్ ద్వారా వాహనాల రాకపోకలను పర్యవేక్షించే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు.రహదారిపై ఏవైనా రోడ్డు ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు సమాచారం అందుకునే వ్యవస్థ , కంట్రోల్ రూమ్ నుంచి తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకునే విధానం, బాధితులకు వేగంగా వైద్య సహాయం అందించేందుకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఎక్కడైనా ప్రమాదం జరిగితే క్షతగాత్రులను కాపాడేందుకు 'గోల్డెన్ అవర్'లో తక్షణమే స్పందించి, ఆసుపత్రులకు తరలించే సమన్వయ వ్యవస్థ పక్కాగా ఉండాలన్నారు.సీసీ కెమెరాల నిఘాను నిరంతరం పర్యవేక్షిస్తూ, మితిమీరిన వేగం మరియు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై నిఘా ఉంచాలని సూచించారు.హైవేపై ప్రయాణించే వాహనదారులు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.ఈ తనిఖీలలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కేశవపట్నం ఎస్సై శేఖర్ హైవే అథారిటీ ప్రతినిధులు, టోల్ గేట్ నిర్వాహకులు సిబ్బంది పాల్గొన్నారు.



# గర్భిణికి విజయవంతంగా శస్త్రచికిత్స ద్వారా ప్రసవం



**చురకలు పెద్దపల్లి జిల్లా ప్రతినిధి. కమాన్ పూర్ అక్టోబర్ 24 :** పెద్దపల్లి జిల్లా జూలపల్లి గ్రామానికి చెందిన 30 సంవత్సరాల గర్భిణి రెండోసారి శనివారం జిల్లా ఆసుపత్రి, పెద్దపల్లికి చికిత్స నిమిత్తం వచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించి స్కానింగ్ చేయగా, గర్భంలో ఉమ్మనీరు చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే గర్భస్థ శిశువు మలం విడుదల చేసినట్లు గుర్తించారు. సదరు మహిళ గత నాలుగు నెలలుగా అధిక రక్తపోటుతో బాధపడుతుండటం తో పాటు, గర్భాశయంలో సుమారు 10 సెంటీమీటర్ల పరిమాణంలో ఫైబ్రాయిడ్ కూడా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.ఈ క్లిష్టమైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ నేతృత్వంలో జాగ్రత్తగా శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా ప్రసవం చేయడం జరిగింది. ప్రస్తుతం తల్లి మరియు శిశువు క్షేమంగా ఉన్నారు.ఈ సందర్భంగా క్లిష్ట పరిస్థితుల్లో సమర్థవంతంగా వైద్య సేవలు అందించి తల్లి, శిశువు క్షేమానికి కృషి చేసిన గైనకాలజిస్ట్ డాక్టర్ రవళిక, అనస్థీషియా వైద్యురాలు డాక్టర్ కృష్ణవేణి, నర్సింగ్ సిబ్బంది మరియు ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ అభినందించారు.ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ మాట్లాడుతూ, జిల్లా ఆసుపత్రి పెద్దపల్లిలో లాపరోస్కోపిక్ సర్జరీలు, లేజర్ చికిత్సలు, ఫిస్టులా చికిత్సలు, యూరాలజీ శస్త్రచికిత్సలు, ఆర్థ్రోస్కోపీ, కేటరాక్ట్ సర్జరీ మరియు ఇంటర్వెన్షనల్ రేడియాలజీ వంటి అధునాతన వైద్య సేవలు ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.పెద్దపల్లి జిల్లా ప్రజలు ఈ అధునాతన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఖరీదైన వైద్య చికిత్సల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లా ఆసుపత్రి, పెద్దపల్లిలోనే నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా పొందాలని డా. కె. శ్రీధర్ కోరారు.

## క్రికెట్ పోటీలలో వకీల్పల్లి మైన్ జట్టు విజయం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 24 :** కోల్ ఇండియా పోటీల్లో సింగరేణి సంస్థ జట్టు రాణించాలి అని సింగరేణి అధికారులు పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఆర్.జి–2 ఏరియాలోని స్థానిక డాక్టర్ ఏ.పి.జె అబ్దుల్ కలాం క్రీడా మైదానంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్ డిపార్ట్మెంటల్ క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి.ఈ పోటీలలో ఏరియాలోని మైన్స్, ఓపెన్ కాస్ట్ మరియు ఇతర డిపార్ట్మెంట్లకు చెందిన మూడు జట్లు పాల్గొన్నాయి.ఆసక్తిగా సాగిన ఫైనల్ మ్యాచ్ లో వకీల్పల్లి మైన్ జట్టు విజేతగా నిలవగా, ఓసీపీ–3 జట్టు రన్నరప్‌గా నిలిచింది.విజేతలకు నిర్వాహకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సూపర్ వైజర్ నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ మహ్మద్ అక్రం, జనరల్ కెప్టెన్ రవీందర్ రెడ్డి తో పాటు క్రీడాకారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక



**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 24 :** వీణవంక మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన ఉడుత సునీల్ ఇటీవల మృతి చెందాడు.మృతుని కుటుంబానికి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు.మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుంభానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఎమ్మెల్యే వీరి.బి ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సిద్దపల్లి మహిపాల్ రెడ్డి,ముసిపట్ల తిరుపతి రెడ్డి,పిఏసి ఎస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి,మనోహర్,కామిడి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎల్‌నినో పై సీఎం సమీక్షలో "ప్రణవ్"



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 24 :** రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం రాత్రి ప్రజాభవన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రభుత్వం ఇప్పటికే జారీ చేసిన సూచనలకు అనుగుణంగా నియోజకవర్గాల్లో పరిస్థితులను అంచనా వేసి, అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు. స్థానిక నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వం ఇచ్చే సూచనలను అమలు చేసేలా ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చామని వొడితల ప్రణవ్ పేర్కొన్నారు.

## ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 24 :** దుర్గామాత నిమజ్జన ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని ప్రముఖ యూట్యూబ్ జబర్దస్త్ బుల్లెట్ భాస్కర్ అన్నారు. ఈ మేరకు శనివారం కమాన్ పూర్ మండల కేంద్రంలోని సుభాష్ నగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ముగించుకొని నిమజ్జనం సందర్భంగా పెద్ద ఎత్తున వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జబర్దస్త్ బుల్లెట్ భాస్కర్, పాహిమా, తదితరులు హాజరయ్యారు.సందర్భంగా మేజిక్ శశి చేసిన అద్భుతాలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమానికి మేజిక్ రాజా వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సందర్భంగా బుల్లెట్ భాస్కర్ మాట్లాడుతూ కార్యక్రమాలకు రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.ప్రజల ఆదరణ తమకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. ఆదరిస్తున్న వారికి ధన్యవాదాలు అని పేర్కొన్నారు.అలాగే నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

## స్వామివారిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకుడు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 24 :** కమాన్‌పూర్ ఆదివారహా స్వామి క్షేత్రంలో మహాదేవపూర్ మాజీ జెడ్పిటిసి గుడాల అరుణ శ్రీనివాస్ దర్శనం చేసుకోవడం జరిగింది.వారికి ఆదివరహాస్వామి దేవస్థానం చైర్మన్ ముస్త్యాల దామోదర్ వారికి శాలువాతో సత్కరించిడం జరిగింది.ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని ఆలయ పూజారి రామానుజం అందజేశారు.ముందుగా స్వామి వారి వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించి అభిషేకం చేశారు.

## ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ నాగేంద్ర చారి విచారణ

**-తెర్లుమద్ది గ్రామంలో బాధిత కుటుంబాన్ని కొట్టిన ఘటనపై ఆరా**



**చురకలు ప్రతినిది ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 24 :** ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి శనివారం గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి కేసు పూర్వాపరాలపై ఆరా తీశారు. వివరాల్లోకి వెళితే..ఈ నెల 20వ తేదీ రాత్రి తెర్లుమద్ది గ్రామంలోని బొడ్రాయి వద్ద డీజే నడుస్తుండగా,దానిని ఆపాలని గ్రామానికి చెందిన కొమ్మట మధు కోరినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు తన ఇంటి వద్దకు వచ్చి తనతో పాటు తన భార్య,తన అన్నపై దాడి చేసి కొట్టినట్లు మధు ఆరోపించారు.ఈ ఘటనపై బాధితుడు ఈ నెల 23వ తేదీన ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు మేరకు ముస్తాబాద్ ఎస్సై జ్యోతి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో శనివారం సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి తెర్లుమద్ది గ్రామానికి చేరుకుని కేసుకు సంబంధించిన అంశాలపై విచారణ నిర్వహించారు.విచారణలో భాగంగా ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధితుల ఆరోపణలు, ఇతర సంబంధిత వివరాలను పరిశీలించినట్లు తెలిసింది. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు తదుపరి చర్యలు చేపడుతున్నారు.

# జనగామలో పర్యటిస్తున్న బిఆర్ఎస్ నేత "బండ"

**-ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ గెలుపుకు వ్యూహం**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 24 :** ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్,హుజురాబాద్ నియోజకవర్గంకు చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండ శ్రీనివాస్ శనివారం జనగామ నియోజకవర్గంలో పర్యటించారు. బిఆర్ఎస్ పార్టీ బండ శ్రీనివాస్ ను ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జనగామ నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించిన విషయం తెలిసిందే.బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఆయన జనగామలో పర్యటించినట్లు తెలిసింది.అక్కడి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో కూడా ఎమ్మెల్సీ ఎన్నికల అంశాన్ని చర్చించారు.అక్కడి పార్టీ శ్రేణులతో సమావేశమై.. నియోజకవర్గంలో ఎంత మంది పట్టభద్రులైన ఓటర్లు ఉన్నారు? ఎంతమంది ఇప్పటివరకు తమ ఓట్లు నమోదు చేసుకున్నారు?ఇంకా ఎంతమంది ఓట్లు నమోదు చేసుకోవాల్సి ఉంది?తదితర అంశాలపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు.అలాగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం బండ శ్రీనివాస్ వ్యూహరచన, కసరత్తు చేస్తున్నారు.నియోజకవర్గంలోని మండల కేంద్రాలతో పాటు.. నియోజకవర్గ కేంద్రంలో, అలాగే పెద్ద గ్రామాల్లో ఎంతమంది పట్టభద్రులు ఉన్నారు? అన్న అంశాలను ఆయన ఆరా తీశారు. నియోజకవర్గంలో ఉన్న విద్యాసంస్థలు,అందులో పని చేస్తున్న ఉపాధ్యాయులు,ప్రభుత్వ ఉపాధ్యాయులు ,ఉద్యోగులు తదితర వివిధ రంగాలకు చెందిన వారిని ప్రత్యేకంగా కలుసుకోవాలని సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు.గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు,ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యం లోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు ఓటర్లకు వివరించాలని, తద్వారా గ్రాడ్యుయేషన్ ఆకట్టుకోవాలని ఆయన జనగామ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యారంగాన్ని దెబ్బతీస్తోందని, కెసిఆర్ ప్రారంభించిన గురుకుల పాఠశాలలను కూడా సక్రమంగా నిర్వహించడం లేదని,ఇంజనీరింగ్ తో పాటు వివిధ వృత్తి విద్య,ఇతర కోర్సులను చదువుతున్న విద్యార్థులకు స్కాలర్షిప్లు చెల్లించడం లేదని, 2023 తల్లి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రచారంలో హామీ ఇచ్చిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలను కూడా ప్రతి చేయలేదని బండ శ్రీనివాస్ ఆరోపించారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను కూడా ప్రభుత్వం అమలు చేయడం లేదని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా,బిఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఓటు వేసి మద్దతు నివ్వాలని ఆయన కోరారు. గ్రాడ్యుయేట్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని ఆయన కోరారు.

# సోమవారం నుంచి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**-కొనుగోళ్లకు సిద్ధమవుతున్న ఐకేపీ అధికారులు.. మహిళా సిబ్బందికి శిక్షణ**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆక్టోబర్ 24 :** ఎల్లారెడ్డిపేట మండలంలో సోమవారం నుంచి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిం చేందుకు ఐకేపీ అధికారులు సన్నద్ధమవుతున్నారు.ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించడం తో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.కొనుగోలు కేంద్రాల నిర్వహణలో భాగంగా శనివారం ఐకేపీ మహిళా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, కేంద్రాల నిర్వహణ, రైతులకు అందించాల్సిన సేవలు తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి డీపీఎం మాణిక్ రెడ్డి, ఏపీఎం వెంకటలక్ష్మి హాజరయ్యారు. సీసీఎస్‌లు మంగ్యానాయక్, దేవేందర్, వెంకటరమణ, సుదర్శన్, సుధాకర్‌తో పాటు వీవోఏలు, కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.వరి ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన సేవలను అందించేందుకు సిబ్బంది సిద్ధమవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో విధులు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో.. ప్రజల్లో మరింత విశ్వాసం

**-పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 24 :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందిస్తూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పిలుపునిచ్చారు. హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆయన శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. స్టేషన్‌కు విచ్చేసిన సీపీకి హుజూరాబాద్ ఏసీపీ మాధవి, ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ పూలమొక్కను అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం సాయుధ బలగాల నుంచి గౌరవ వందనాన్ని కమిషనర్ స్వీకరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లోని పలు విభాగాలు, రిజిస్టర్లు, దస్త్రాలను సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది విధుల కేటాయింపు, క్షేత్రస్థాయి పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో మరింత పారదర్శకత, వేగవంతమైన పనితీరు కనబరచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, స్టేషన్ పరిధిలోని నిఘా కెమెరాలు నిరంతరం పనిచేసేలా ప్రత్యేక నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. పెట్రోలింగ్ వాహనాలు, ఆధునిక పరికరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహిస్తూ అత్యవసర వేళల్లో ప్రజలకు వెంటనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు.కేస్ ప్రాపర్టీ భద్రత, రికార్డుల క్రమబద్ధీకరణ, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపయోగంలో లేని పాత సామాగ్రిని కమిషనరేట్‌కు తరలించి, స్టేషన్ ప్రాంగణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మాధవి, ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఎస్సైలు రవి, కృష్ణా రావు, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటవీ సరిహద్దు వివాదాలు పరిష్కరించి,

# భూముల రీ సర్వేను వేగవంతం చేయాలి

**-రెవెన్యూ,అటవీ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ**
**-రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి రీ సర్వే చేపట్టాలి**
**-భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 24 :** అటవీ సరిహద్దు వివాదాలను పరిష్కరించి, భూముల రీ సర్వే పనులను వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ ఆదేశించారు. రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని సూచించారు. శనివారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూముల రీ సర్వే పురోగతి, బృందాల ఏర్పాటు, అటవీ సరిహద్దు వివాదాలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జగిత్యాల సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ మాట్లాడుతూ రీ సర్వే పనులు సక్రమంగా సాగేందుకు అవసరమైన బృందాలను ఏర్పాటు చేసి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అటవీ సరిహద్దు వివాదాలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రీ సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు సమాచారం అందించాలని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న రైతులకు కూడా వారి భూముల్లో సర్వే నిర్వహించే తేదీలను ముందుగానే తెలియజేసి, వారు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రీ సర్వే సందర్భంగా క్షేత్రస్థాయి రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. రీ సర్వే పనులకు అవసరమైన అదనపు రోవర్ పరికరాలను ప్రభుత్వం తగిన సంఖ్యలో సమకూరుస్తుందని తెలిపారు. భూ భారతి తరహాలో రీ సర్వే కోసం ప్రత్యేకంగా కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. సిబ్బంది, పరికరాలను సమర్థంగా వినియోగించుకొని పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ, ఆర్డీఓలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, సర్వే, భూ రికార్డుల శాఖ సహాయ సంచాలకులు, కలెక్టరేట్ ఏవో కిషన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఎల్‌బీ సీటు సాధించిన ముఫ్తి మొయిజ్ షాంజీకి ఘన సన్మానం

**-విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యం.. మైనార్టీ యువత ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి**
**-మైనార్టీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందనలు**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 24 :** విద్యతోనే సమాజంలో గౌరవం,గుర్తింపు లభిస్తాయని,ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని మైనార్టీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు.మెట్‌పల్లి పట్టణానికి చెందిన ప్రముఖ మత పెద్ద ముఫ్తి మొయిజ్ షాంజీ ఎల్ఎల్‌బీ (న్యాయశాస్త్రం)కోర్సులో సీటు సాధించిన సందర్భంగా ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

**పూలదండలతో సత్కారం.. అభినందనల వెల్లువ**

మైనార్టీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్వర్ సిద్దికీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఫ్తి మొయిజ్ షాంజీకి పూలదండలు వేసి ఘనంగా సత్కరించారు.న్యాయశాస్త్రం అభ్యసించేందుకు సీటు సాధించడం అభినందనీయమని సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.విద్యకు వయస్సుతో సంబంధం లేదని,నేర్చుకోవాలనే తపన, సాధించాలనే పట్టుదల ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని పేర్కొన్నారు.

**విద్యతో పాటు సామాజిక సేవలోనూ ముందుండాలి**

మత పెద్దలు ఆధ్యాత్మిక మార్గదర్శకులుగానే కాకుండా విద్యా, సామాజిక రంగాల్లోనూ కీలక పాత్ర పోషించాలని సభ్యులు ఆకాంక్షించారు. న్యాయశాస్త్రం అభ్యసించడం ద్వారా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు,ప్రజలకు న్యాయ పరమైన అంశాలపై అవగాహన కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు.ముఖ్యంగా మైనార్టీ వర్గాలకు చెందిన యువత విద్యకు ప్రాధాన్యత నిస్తూ ఉన్నత చదువుల వైపు అడుగులు వేయాలని సూచించారు.విద్య,విజ్ఞానం, క్రమశిక్షణ,నిరంతర కృషితో వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ అభ్యున్నతికి కూడా దోహదపడవచ్చని పేర్కొన్నారు. ముఫ్తి మొయిజ్ షాంజీ ఎల్ఎల్‌బీ కోర్సులో సీటు సాధించడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యా, సామాజిక రంగాల్లో ప్రతిభ కనబరిచే వ్యక్తులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మందిలో స్ఫూర్తి నింపవచ్చని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ముక్రం బైగ్, ఉపాధ్యక్షులు సుజాయిత్ అలీ, ఖలీల్, మసిఉద్దీన్, సాజిద్, వాజిద్, ముజాహిద్, జమీల్, వాసిక్ ఉర్ రహమాన్, బషీరుద్దీన్ సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఖైదీలకు న్యాయ సహాయం రాజ్యాంగ హక్కు

**-సివిల్ జడ్జి పి.బి. కిరణ్ కుమార్**



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్, అక్టోబర్ 24 :** హుజూరాబాద్ సబ్‌జైలులోని ఖైదీలకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సివిల్ జడ్జి మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.బి. కిరణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి పీబి కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. ఆర్థిక స్తోమత లేని విచారణ ఖైదీలకు, శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం పొందడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని స్పష్టం చేశారు. న్యాయ సేవాధికార సంస్థల చట్టం కింద అందుబాటులో ఉన్న ఉచిత లాయర్ సేవలు, బెయిల్ పొందే విధానాలు మరియు లోక్ అదాలత్ ద్వారా కేసులను సామరస్యంగా పరిష్కరించుకునే మార్గాలను ఆయన వివరంగా తెలియజేశారు. ఖైదీలు తమ సమస్యల పరిష్కారానికి, న్యాయ పోరాటానికి న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఖైదీలు అడిగిన పలు న్యాయపరమైన సందేహాలను జడ్జి నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైలు పర్యవేక్షణ అధికారి పి. శ్రీనివాస్, అసిస్టెంట్ డిప్యూటీ జైలర్ టి. సురేష్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే సంజయ్ పరామర్శ



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (24) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కమ్మరిపెల్లి రాజన్న, గొర్రెశెట్టి గంగారం కుటుంబాలను శనివారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరామర్శించారు.మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, బాధను దిగమింగుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం తరఫున అందే సహాయ సహకారాలు ఏమైనా ఉంటే,అర్హతల మేరకు బాధిత కుటుంబాలకు అందేలా కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు దొంతుల తుకారం, దోమకొండ రాజన్న, గ్రామ శాఖ అధ్యక్షుడు తోకల శేఖర్, పర్రె రమేష్, సల్కం నర్సయ్య, తాండ్ర నరేష్, బాయి లింగారెడ్డి, మీరా రాజేందర్, ఆప్కా గణేష్, బాయి భూమారెడ్డి, ఆరెపల్లి ఆనందం, ఆరెపల్లి సురేష్, చెక్కిళ్ల అశోక్ గౌడ్, తాండ వెంకటి, బోయిన గంగాధర్, వార్డు మెంబర్ తాండ్ర దశకుమార్, ఆప్కా దేవరెడ్డి, తాండ్ర గంగాధర్, గొర్రె సురేష్, తాండ్ర నర్సయ్యలు ఉన్నారు.

## తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసిన టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**-విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకుని తిరిగొచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు**



**చురకలు ప్రతినిధి హైదరాబాద్, అక్టోబర్ 24 :** తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎస్.ఎం. హుస్సేని (ముజీబ్) శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఇటీవల స్పీకర్ గడ్డం ప్రసాద్ చేపట్టిన అధికారిక విదేశీ పర్యటన విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో డా.ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్)ఆయనకు హృదయపూర్వక అభినందనలు,శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా స్పీకర్‌తో ఆత్మీయంగా మాట్లాడి,విదేశీ పర్యటన విజయవంతంగా పూర్తిచేసుకుని తిరిగి వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభకు ఉన్న ప్రాధాన్యతను,ప్రజా ప్రతినిధుల బాధ్యతలను గౌరవిస్తూ ఈ భేటీ సుహృద్భావ వాతావరణంలో సాగింది.

## డీఎస్సీ 2024 ఉపాధ్యాయుల ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలి



**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 24 :** ఈ నెల 10వ తేదీకి రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న డీఎస్సీ 2024 ఉపాధ్యాయుల ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలని పీఆర్టీయూటీఎస్ జగిత్యాల జిల్లా శాఖ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.జిల్లా విద్యాధికారి రాముకు శనివారం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యల్ల అమర్నాథ్ రెడ్డి, బోయినిపెల్లి ఆనంద్ రావు వినతి పత్రం అందజేశారు.డీఎస్సీ 2024 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులు రెండేళ్ల సేవాకాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో వారి సర్వీసు బుక్స్ వెరిఫై చేసి స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

